
# మంగమ్మగారు మఠం భోజనం

"ఏమండీ! మీకు చపాతీలా? లేక అన్నం తింటారా? జెమిని టి.వి.లో ఏడుపుగొట్టు సీరియల్ చూస్తూ కూర్చున్న మంగపతిగారిని అడిగారు మంగమ్మగారు.

'నాకైతే చపాతీలే ఇష్టం గానీ ఆ ఫ్రోజెన్ చపాతీలైతే మాత్రం వద్దు. కాస్త సూప్ చేసివ్వు చాలు" అన్నారు మంగపతిగారు.



"ఇదిగో ఇదీ వరస. చూశావుగా బుజ్జీ అందరం సుబ్బరంగా, ఇష్టంగా తింటున్నాం ఆ ఇండియన్ స్టోర్ నుండి కొనుక్కొచ్చిన పరాటాలు, చపాతీలు. ఈయన గారికి మాత్రం వీలయితే ఇప్పుడే గోధుమలు పండించి, మరపట్టించి, పిండి కలిపి, చేసిన చపాతీలు కావాలి. లోకమంతా ఇన్‌స్టెంట్ ఫుడ్ తింటుంటే మనం మాత్రం ఇంకా వెనక్కి వెళ్ళి తిరగట్లో విసిరిన పప్పు, రోటిలో రుబ్బిన పిండితో దోశలూ తింటాం!" రుస రుసలాడారు మంగమ్మగారు.

"ఏమైంది నాన్నా ఆ పరాటాలకు? హాయిగా మైక్రో వేవ్ ఓవెన్‌లో నాలుగు క్షణాలు వేడి చేసుకుంటే ఫ్రెష్‌గా తయారవుతాయి. లేదా పెనం మీద ఓ నిమిషం కాల్చినా చాలు. ఏవో అవి దొరకబట్టి మేము బ్రతికి పోతున్నాం" అంది బుజ్జి.

"అవునమ్మా! అమెరికా వచ్చినా అనంతపురం బుద్ధులు పోవు. ఏం చేస్తాం? మీ అమ్మను కష్టపెట్టకూడదనేగా సూపు అలవాటు చేసుకున్నాను. అదే ఇవ్వమన్నాను" అన్నాడాయన.

"ఇదిగో ఇలాంటి మాటలు వింటేనే ఒళ్ళు మండుతుంది. నలభై ఏళ్ళుగా ఒకరోజు తప్పకుండా కంచంలోకి వండి వడ్డిస్తూనే వున్నా ఏదో తక్కువ చేసినట్టు మాట్లాడుతారు. నేను వెళ్ళి కొన్నాళ్ళు ఏ మఠంలోనో చేరతాను. అప్పుడు తెలిసొస్తుంది నా విలువ" అంటూ ఉక్రోషపడింది మంగమ్మగారు.

"అన్నట్టు మావయ్యగారు 'బెర్కిలీ' లో వున్న రామకృష్ణ మఠం చూడాలని చాలాసార్లు అన్నారు. ఈ ఆదివారం వెళ్ళొద్దామా?" బుజ్జి మొగుడు అడిగాడు.

"తప్పకుండా వెడదాం నాయనా. అక్కడగానీ 'రిట్రీట్' అంటారే అలాటిదేమయినా వుంటే నేను పదిరోజులు అక్కడే వుండిపోతాను" వెంటనే అన్నారు మంగమ్మగారు.

"అయితే మనం రేపు 'బెర్కిలీ'కి వెడుతున్నామన్న మాట. అప్పుడోసారి వెళ్ళినప్పుడు యూనివర్సిటీ చూపించారుగానీ రామకృష్ణ మఠం చూడలేదు. అక్కడికి దగ్గర్లోనే ఇస్కాన్‌వారి కృష్ణ మందిరం కూడా వుందటగా?" మంగమ్మగారి దూకుడు తనకు అలవాటే అన్నట్టు చిదానందంగా నవ్వుతూ అన్నారు మంగపతిగారు.

"అయితే పొద్దున్నే తొందరగా లేచి పులిహోర పెరుగన్నం కలిపి సిద్ధం చేసేద్దామే బుజ్జీ" అంటూ అంతకుముందు కోపం మరచిపోయి హడావుడి పడ్డారు మంగమ్మగారు.

"ఇంక మళ్ళీ మనం వండుకుని మోసుకుపోవడం దేనికమ్మా? ఎక్కడో ఒకచోట ప్రసాదం తినేస్తే సరిపోతుంది" అంది బుజ్జి.

మామూలుగా వాళ్ళు కాలిఫోర్నియాలో బుజ్జి దగ్గర వున్నప్పుడు 'లివర్‌మూర్' లో గుడికి వెళ్ళినా, మూడో అమ్మాయి చిన్ని దగ్గర ఫిలడెల్ఫియా స్టేట్‌లో పిట్స్‌బర్గ్‌లో వుంటే అక్కడ వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళినా ఆ రోజుకు గుళ్ళో ప్రసాదమే కొనుక్కుని తినేస్తారు. అది గుర్తొచ్చి "అయితే రేపు మీ నాన్నకి నా వంట తినే గొడవలేదు" అన్నదావిడ నవ్వుతూ.

మరుసటి రోజు ఆదివారం కావడాన అలవాటుగా కాస్త ఆలస్యంగా నిద్రలేచారు బుజ్జీ, ఆమె భర్త.

అందరూ స్నానాలుచేసి, టిఫిన్ తిని, పిల్లని తయారుచేసి బయట పడేసరికి పదకొండు గంటలయింది.

దార్లో కాసేపు ఆగి సోడాలు (కూల్ డ్రింక్స్) తాగి తిరిగి ప్రయాణం కోసం వెదుక్కుని వెళ్ళారు.

బెర్కిలీ చేరే సరికి పన్నెండున్నర అయింది. ముందు ఇస్కాన్ గుడి కోసం వెదుక్కుని వెళ్ళారు.

పెద్ద గుడి అయినా బయటకు గుడిలా అగుపించదు లోపల విశాలంగా వున్న హాల్లో గోడలకు చక్కని అయిల్ వర్ణ చిత్రాలున్నాయి. కాళింగ మర్ధనం, రాసలీల, గోవర్ధనగిరిని చిటికెన వ్రేలిమీద నిలిపిన కృష్ణుడు లాటి చిత్రాలు చిన్నారిని కూడా ఆకర్షించేయి. ఒక్కో బొమ్మ ముందుకూ పరిగెత్తి వెళ్ళి నిలబడి 'మమ్మీ టేక్‌మై పిక్చర్' అంటూ ఫోటోలు దిగింది.

పూరీ జగన్నాథ్‌లో వున్నట్టుగా వున్న సుభద్ర బలరామకృష్ణుల విగ్రహాలకు నమస్కరించి వాళ్ళు బయటి హాల్లోకి వచ్చేసరికి పెద్ద పెద్ద ఖాళీ గుండిగలు లోపలికి మోసుకుపోతున్నారు అక్కడి పూజారులు. గుళ్ళో అంతా పచ్చ కర్పూరంతో కూడిన చక్కెర పొంగలి వాసన ఘుమా ఇస్తోంది.

తీరా వీళ్ళు రాగానే 'సారీ' అన్నారు ప్రసాదం పంచేవాళ్ళు.

"ఒక అరగంట ముందుగా వచ్చినా బాగుండేది. ఎంతైనా గుళ్ళో చేసే చక్కెర పొంగలి రుచి మనం ఇంట్లో వండుకుంటేరాదు ఎంచేతో..." బోల్డు విచార పడ్డారు మంగమ్మగారు.

"ఎందుకంటే వాళ్ళు పోసినట్టు మనం నెయ్యిపోయం గనుక ఆ రుచిరాదు..." అంది బుజ్జి.

"సరే పదండి... మళ్ళీ రామకృష్ణ మఠం మూసేసి పోతారో ఏమిటో..." అన్నది మంగమ్మగారు.

హైద్రాబాదులోనూ, బెంగుళూరులోనూ రామకృష్ణ మఠానికి వెడితే బయటకు రావాలనిపించదు. ఆయన విగ్రహం ముందు మనం మఠం వేసుకుని కూర్చుని కళ్ళు మూసుకుంటే ఇక ఆ ప్రశాంతత వదిలి పోవాలనిపించదు. ఇక్కడి మఠం ఎలా వుందోమరి..." అన్నారు మంగపతిగారు.

"మనవాళ్ళు ఈ దేశం వచ్చి ఈ గుళ్ళూ గోపురాలు, మఠాలు ఏర్పాటు చేసుకోవడమే గొప్ప. ఇక్కడి జనాభాలో మన వాళ్ళ సంఖ్య గణనీయంగా పెరిగేకొద్దీ ఇవన్నీ సాధ్యపడ్డాయి. ఇప్పుడు ఎన్నికల్లో కూడ అమెరికన్ ఇండియన్లది బలమైన స్థానమే. వాళ్ళ ఓటుకు ఆకట్టుకోవడానికి రాజకీయ నాయకులు ప్రయత్నిస్తుంటారు" అన్నాడు బుజ్జి మొగుడు.

వీళ్ళు మళ్ళీ ఆ సందూ ఈ రోడ్డూ తిరిగి దారి కనుక్కుని రామకృష్ణాశ్రమం చేరే సరికి బాగా ఆలస్యమయింది. బయట నుండి చూస్తే అదొక మామూలు ఇల్లులా కనబడుతూంది. బోర్డుమీద పేరు రాయబట్టి అదే తాము వెదికే స్థలమని రూఢి చేసుకున్నారు. తీరా కారు పార్క్‌చేసి గేటు దగ్గరికి వచ్చేసరికి పెద్ద గేటుకి తాళం వేసేసి వుంది.

"అనుకున్నంతా అయింది" అంటూ నిరాశ పడ్డారు మంగమ్మగారు. అంతలో లోపలి నుండి ఒకతను వీళ్ళని చూసి చిన్నగేటులో నుండి లోపలి రావొచ్చుననీ, లంచ్ టైము గనుక పెద్దగేటు తాళం వేశారని చెప్పాడు.

తీరా భోజనాల సమయానికి వచ్చామే అని కాస్త మొహమాటంగా అనిపించినా, ఇంతదూరం వచ్చేకా చూడకుండా వెళ్ళడం ఎలాగ అనుకుంటూ అందరూ లోపలికి వెళ్ళారు.

బిల్డింగు చిన్నదే అయినా చక్కని లైబ్రరీ వుంది. రామకృష్ణ, వివేకానందల రచనలు అద్దాల బీరువాలలో అమర్చివున్నాయి. అవే కాకుండా రమణ మహర్షి, ఓషో పుస్తకాలు కూడా వున్నాయి. చిన్న భోజనాల గది, దాని పక్కనే ఒక హాలు వున్నాయి.

హాల్లో స్వామీజీ కాషాయ వస్త్రాలలో పవిత్రంగా ప్రశాంతంగా కనిపించారు.

ఆయన చేతిలో చిన్న పళ్ళెంలో ఆహారం వుంది. ఆయన చుట్టూ కూర్చున్న ఆడ మగ జనం కూడా భోజన కార్యక్రమంలో వున్నారు.

అందులో అమెరికన్లూ, ఇండియన్లూ కూడా వున్నారు. అందరూ చాలా వరకు మౌనంగా వుండటమో మరీ అవసరమైతే చిన్నగా మాట్లాడ్డమో చేస్తున్నారు.

"మమ్మీ అయామ్ హంగ్రీ" అంది చిన్నపాప. వీళ్ళు వంటగది దగ్గరికి రాగానే అక్కడున్న వాళ్ళు సాదరంగా ఆహ్వానించి పళ్ళేలు అందించారు వడ్డించుకోమంటూ.

కొందరు వాలంటీర్లు పాత్రలు కడుగుతున్నారు. మరి కొందరు వడిస్తున్నారు బఫే టైపులో

బుజ్జి వెళ్ళి పాపకు తినడానికి పాస్తా, నూడుల్స్ కప్పులో వేసి పళ్ళెంలో పెట్టి తీసుకువచ్చింది.

టైము దగ్గర దగ్గర రెండు గంటలు కావొస్తూండేమో పెద్ద వాళ్ళకు కూడా కడుపులో కరకర లాడుతూంది ఆకలి.

పళ్ళేలలో వడ్డించుకున్నాక కొంతమంది బయట వున్న చిన్న గార్డెన్‌లో కూర్చుని తింటున్నారు.

అమ్మా మనం కూడా ఏదో కాస్త తినేసి వెళ్దాం" అంది బుజ్జి.

మంగపతిగారు వెళ్ళి తను కూడా నూడుల్స్, పాస్తా తెచ్చుకున్నారు.

బుజ్జి, ఆమె భర్త బర్గర్ తెచ్చుకున్నారు. మంగమ్మగారు పళ్ళెం తీసుకువెళ్లి నిలబడి ఏం వడ్డించుకోవాలా అని చూస్తున్నారు.

ఒక బేసిన్లో క్యాబేజి కూర కనబడితే కాస్త వేసుకున్నారు. అది ఏలకుల వాసన వొస్తోంది. రెండు స్పూన్ల నూడుల్స్ వడ్డించుకుని బయటకు వచ్చేసిందావిడ.

ఆ పదార్థాలను చూస్తుంటేనే తినాలనిపించడంలేదు ఆమెకు.

ఊరికే స్పూనుతో అటూ ఇటూ కలుపుతూ తింటున్నట్టు నటించి అంతా తీసుకెళ్ళి చెత్తబుట్టలో పారేసి వచ్చి మంచినీళ్ళు అడిగి తీసుకుని గటగట తాగేసిందామె.

"మీరు మంచి ఉపన్యాసం మిస్ అయ్యారు" అన్నది మంగమ్మగారి పక్కన కూర్చున్న ఒక పంజాబీ ఆమె.

"స్వామీజీ అమెరికా వచ్చి నలభై సంవత్సరాలైపోయిందట" ఇటువైపు కూర్చున్న గుజరాతీ చీరెకట్టుతో వున్నామె భక్తిగా చెప్పింది.

"అలాగా?" అన్నట్టు తల ఊపారు మంగమ్మగారు. ఆవిడకు ఆకలి ఎక్కువై తలపోటు మొదలయింది. ఎప్పుడెప్పుడు బయల్దేరి ఇల్లు చేరుదామా అని వుందామెకు.

"అమ్మా వెళ్దామా? మనం కాస్త త్వరగా వచ్చి వుంటే బాగుండేది. ఇస్కాన్ గుడికి వెళ్ళి వచ్చేసరికి ఇక్కడ ఉపన్యాసం కాస్తా అయిపోయింది. మధ్యాహ్నం ఇష్టమైన వారు లైబ్రరీలో చదువుకుంటార్ట. లేకుంటే కాసేపు ధ్యానం చేస్తార్ట. అంతే... ఇంకేం ప్రోగ్రాం లేదు" అంది బుజ్జి.

మంగమ్మగారు నీరసంగా లేచారు "అయితే పదండి వెడదాం" అంటూ.

"అమ్మా నువ్వేమీ తినలేదుకదూ? నాన్నే నయం ఆ నూడుల్స్ కాస్త తిన్నారు. ఇక్కడెక్కడైనా ఇండియన్ హోటల్ వుందేమో చూద్దాం. అక్కడైనా కాస్త తిందువు" అంది బుజ్జి మంగమ్మగారి భుజం చుట్టూ చేయివేసి.

ఆ మాట వినగానే మంగమ్మగారి ముఖంలోకి కళ వచ్చింది.

"మనం వచ్చేదార్లోనే ఉడిపి హోటల్ చూశాను" ఉత్సాహంగా అన్నాదావిడ.

"వాళ్ళైనా ఇంతదాక తెరచి వుంటారా? ఇస్కాన్ గుడిలో మంచి చక్కెర పొంగలి మిస్సయినట్టే ఇక్కడ హోటల్లో దోశ మిస్సవుతామో ఏమిటో" అంటూ వెంటనే నిరాశ పడిందావిడ.

అప్పుడే అక్కడకు వచ్చిన మంగపతిగారు వడలిపోయిన భార్య ముఖం చూసి నవ్వుతూ "ఇంతకీ ఇక్కడ రిట్రీట్' లాటిది వుందేమో కనుక్కున్నావా బుజ్జీ? మీ అమ్మ ప్రశాంతంగా వారం పదిరోజుల పాటు ఆశ్రమ జీవితం గడపాలని సరదాపడింది కదా! పాపం..." అనడిగారు కూతుర్ని.

"అత్తయ్య అసలే తిండి తినక నీరసంగా వున్నారు. ఇంకో వారం రోజులపాటు ఇక్కడే వుండి రోజూ నూడుల్స్, బర్గర్‌లు ఏలకుపొడి వేసిన క్యాబేజి కూర తినాలని తలచుకుంటేనే ఇంకా నీరసమొస్తుంది" అన్నాడు అల్లుడు సానుభూతిగా.

"మీ మావయ్య మాత్రం వుండగలరని అనుకుంటున్నారా ఏమిటి? నాలుగేళ్ళ క్రిందట బరువు తగ్గాలి, కీళ్ళ నొప్పులు తగ్గాలి అంటూ బెంగుళూరులో జిందాల్ ప్రకృతి చికిత్సా కేంద్రంలో చేరారు. నెల రోజులు వుంటానని వెళ్ళిన మనిషి కాస్తా వాళ్ళు ఇచ్చే పాలకూర రసం, అనపకాయ రసం లాటివి త్రాగి వుండలేక మల్లెపువ్వుల్లాటి ఇడ్లీలు, మైసురు బజ్జీలు తినాలని వారంలో వెనక్కి వచ్చేశారు తెలుసా?" అంటూ విజయ గర్వంతో మంగపతిగారి వైపు చూశారు.

మంగపతిగారు బిస్కెట్ దొంగిలిస్తూ పట్టుబడ్డ పిల్లాడిలా నవ్వేశారు.

"అందుకే మరి నువ్వు ఇంకోసారి మఠంలో చేరిపోతాను అంటూ బెదిరించకు. అదేదో సినిమాలో చంద్రమోహన్ మఠంలో చేరి లడ్డూలు, గారెలు, పులిహోర వడ్డిస్తారని ఎదురుచూసి భంగపడినట్టు నీకూ ఇలాటి అనుభవం తెలిసొచ్చింది కదా! నేను కూడా ప్రకృతి ఆశ్రమాల పేరెత్తను సరే త్రోజెన చపాతీలు వద్దని అనను. సరేనా?" అంటూ భార్యతో ఒప్పందానికి వచ్చారు.

"అత్తయ్యా! ఇంకా ఆలస్యం చేసారంటే ఆ ఉడిపి రెస్టారెంటు కూడా మూసేస్తారు. పదండి వెడదాం" అంటూ తొందర చేశాడు అల్లుడు. "మీ నాన్నకు నాలుక పొడవనీ, రుచులు కావాలనీ అంటూను గానీ నాక్కూడా మన వంటలు లేకుంటే అన్నం దిగదే బుజ్జీ" అంటూ కూతురితో రహస్యంగా చెప్పి, మంగపతిగారికేసి చూసి ముసిముసిగా నవ్వారు మంగమ్మగారు.

"అయితే మంగమ్మగారి మఠం భోజనం సరదా తీరినట్టేగదా!" అంటూ మరోసారి వుడికించారు మంగపతిగారు.